క్లుప్తంగా

పూర్తిస్థాయిలో భూసర్వే



మాట్లాడుతున్న ఆర్డీవో సీతారామ్మూర్తి

కంచిలి: మండలంలో అన్ని రెవెన్యూ గ్రామాల్లో నిబంధనల ప్రాప్తికి భూసర్వేను ప్రక్రియను పూర్తిచేయాలని పలాస ఆర్డీవో తమరాల సీతారామ్మూర్తి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో నిల రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఇప్పటి వరకు చేపట్టిన సర్వే ప్రక్రియను సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై ఎలా వ్యవహరించి, ప్రక్రియను పూర్తి చేయాలో అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఎస్.హైమావతి, డీటీలు కృష్ణమూర్తి, సంతోష్, ఆర్ఐ అపర్ణ, సర్వేయర్ నాగేశ్వర రావు పాల్గొన్నారు.

బాలికలకు క్రీడా దుస్తులు వితరణ



క్రీడాదుస్తులు అందజేస్తున్న జయకృష్ణ, మల్లేశ్వరరావు

కవిటి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ క్రీడల్లో రాణిస్తున్న బాలికలకు దాతలు క్రీడా దుస్తుల వితరణ చేయడం శుభ పరిణామమని హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెంది క్రీడల్లో పాల్గొంటున్న 20 మంది బాల బాలికలకు అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి బి.జయకృష్ణ సుమారు రూ.18 వేలు వెచ్చించి క్రీడా దుస్తులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పొల్లాయి వాసుదేవ రావు, ఆలపాటి వెంకటరావు, కొల్ల జానకి రావు, టి రాధిక, బి.అరుణకుమారి, పీబీకే శర్మ, నాగరాజు, శ్రీరాములు, జి.జయప్రకాష్ పాల్గొన్నారు.

నందిగాం మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



కృష్ణస్వామి (ఫైల్)

నందిగాం: నందిగాం పంచాయతీ మాజీ సర్పంచ్ ప్రగడ కృష్ణ స్వామి (83) అనారోగ్యంతో ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగలోని కుమార్తె బడగల జానకీరాణి ఇంటివద్ద బుధవారం కన్నుమూశారు. ఈయన సర్పంచ్‌గా మూడు పర్యాయాలు, నందిగాం మండల పరిషత్‌కు ఉపాధ్యక్షుడుగా ఒకసారి పని చేశారు. ఇతని భార్య రాజులమ్మ కూడా ఎనిమిది నెలల క్రితం మృతి చెందింది. కృష్ణమూర్తి మృతిపై నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, బీజేపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త అట్టాడ రవిబాబ్జీ, పీఏసీఎస్ అధ్యక్షుడు కురమాన బాలకృష్ణారావు, నందిగాం సర్పంచ్ జద్యాడ రమణమ్మ తదితరులు సంతాపం తెలియజేశారు.

సామాజిక భవనం శ్లాబ్ పనులు పూర్తి



శ్లాబ్ వేస్తున్న దృశ్యం

టెక్కలి: బొప్పాయిపురం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ సామాజిక భవనం నిర్మాణ పనుల్లో భాగంగా బుధవారం శ్లాబ్ పనులు పూర్తి చేశారు. సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ ప్రజాప్రతినిధులు, స్థానిక కార్యకర్తల సమక్షంలో శ్లాబ్‌ను వేశారు. స్థానిక నాయకులు ఎ.రాహుల్, తవిటయ్య, చంద్రరావు, కోదండ, సూర్యనారాయణ, త్రినాథరావు, పద్మ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జి.సిగడాం: ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ పంటలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా రిసోర్సుసెంటర్ వ్యవసాయశాఖ అధికారులు వై.సూర్యకుమారి, వై.శారద అన్నారు. చెట్టుపొదిలాం గ్రామంలో 'పొలం పిలుస్తోంది'కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పొలాల్లో పంటలను వేసుకునే ముందు వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి, తక్కువ పెట్టుబడితో అధిక రాబడులు సాధించే దిశగా పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. వరి సాగులో ఎక్కువగా కాలిబాటలు వేసుకుంటే దుబ్బు ఎదుగుదలతోపాటు పంట దిగుబడి బాగుంటుందన్నారు. అన్ని పంటల కంటే మొక్కజొన్న సాగు చేసుకుంటే పెట్టుబడి తక్కువ, నీరు కూడా పెద్దగా అవసరం ఉండదని అవగాహన కల్పించారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ



ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సోంపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. సోంపేట సచివాలయం–1 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రతి సచివాలయానికి గడప గడపకు నిధులు 20 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రికి అండగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోంపేట, కంచిలి ఎంపీపీలు నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బెందాళం పద్మావతి, సర్పంచ్ నగిరి ప్రభావతి, సుంకిడి సర్పంచ్ శిలగాన భాస్కర రావు, ఉపసర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, ధర్మారావు, పార్టీ నాయకులు రవికుమార్, నెహ్రూ, కోట్ని శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన ఆరోగ్యం వ్యాయామంతోనే సాధ్యం



మాట్లాడుతున్న అప్పారావు

ఇచ్ఛాపురం: విద్యార్థులు శారీరకం, మానసిక ఆరోగ్యంగా ఉండడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు అన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణంలో హెచ్ఎం ఎస్.విశ్వనాథం అధ్యక్షతన మొట్టమొదటి సారిగా నియోజకవర్గ స్థాయిలో వ్యాయామ విద్యపై స్కూల్‌కాంప్లెక్సును బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థి రోజులో కనీసం 40 నిమిషాలు వ్యాయామ విద్యలో పాల్గొనేలా చూసుకోవాలని జోన్–1 వ్యాయామ విద్యా అధ్యక్షుడు కె.పద్మనాభం రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. వ్యాయామవిద్యలో భాగంగా శారీకశ్రమ, క్రీడలు, యోగా, ఎరోబిక్స్ నిర్వాహణకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల క్రీడా నిర్వాహకులు వజీర్‌అహ్మద్, కృష్ణపుడియా, ఎల్.కె.పండా, కార్తిక్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్

కంచిలి: పశువులకు విధిగా వ్యాధి నిరోధక టీకాలను రైతులు వేయించేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిశోర్ అన్నారు. పశు సంక్షేమశాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలని సూచించారు. కంచిలిలోని మండల పశువైద్యకేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కంచిలి, సోంపేట మండలాల సిబ్బందితో సమీక్ష జరిపారు. మండలంలో జరుగుతున్న ముద్ద చర్మపు వ్యాధి నివారణ టీకాలు వేసే ప్రక్రియపై ఆరా తీశారు. ప్రతి పాడిరైతు తమ పాడి పశువులకు తప్పనిసరిగా లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయించుకునేలా చూడాలన్నారు. రైతు భరోసా కేంద్రాల పనితీరుని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ పనిని నిబద్ధత, అంకిత భావంతో చేసి పాడి రైతులకు మేలు చేయాలన్నారు. తమ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం పశువైద్యశాల రికార్డులను పరిశీలించారు. సమావేశంలో సోంపేట ఏడీ కె.అప్పలస్వామి, పశువైద్యులు టి.శిరీష, జి.కిరణ్‌కుమార్, ఎ.చైతన్య, బి.శిరీష పాల్గొన్నారు.

గద్దర్ కుటుంబానికి పరామర్శ



గద్దర్ భార్య విమలను పరామర్శిస్తున్న కళావేదిక ప్రతినిధులు

మందస: ఇటీవల మృతి చెందిన ప్రజాగాయకుడు గద్దర్ కుటుంబ సభ్యులను సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో పరామర్శించారు. కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు గద్దర్ ఉద్దానం రావడంతో ఆయనతో ప్రతినిధులకు అనుబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేన దేవరాజు, యాదగిరిలు గద్దర్ నివాసానికి వెళ్లి ఆయన భార్య విమలను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఉద్దానంతో గల అనుబంధాన్ని వివరించారు. అనంతరం గద్దర్ కుమార్తె వెన్నెలను కూడా పరామర్శించారు. మహాబోధి విద్యాలయం ఆవరణలోని గద్దర్ సమాధి వద్ద నివాళులర్పించారు.

'కవ్వం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ప్రముఖులు

కాశీబుగ్గ: 'కవ్వం' పుస్తకావిష్కరణ కార్యక్రమం పట్టణంలోని ప్రైవేటు భవనంలో ఉత్సాహంగా జరిగింది. జనం బాధలు, గాథలు, అన్యాయాలు, దోపిడీలు, పోరాటాలు, త్యాగాలు, కళింగసీమ అస్తిత్వాన్ని రచయిత వి.రాజారావు ఒడిసిపట్టి మన ముందుకు తీసుకురావడం గొప్పవిషయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కళింగ సీమ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.ఖగేశ్వర రావు, డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ తెప్పల ఆనందరావులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయితలు, సాహిత్య సంస్థ ప్రతినిధులు సన్నశెట్టి రాజశేఖర్, బద్రి కూర్మారావు, చిగురువలస జగదీష్, కుత్తుం వినోద్, స్వామి నాయుడు, దాసరి తాతారావు, హేమసుదన్, శానిన అశోక్, గుమ్మడి సాంబమూర్తి, కే సోమేష్, సొర్ర రామారావు, జె.గజలక్ష్మి, కంచరాన భుజంగరావు, లండ సాంబమూర్తి, బమ్మిడి సుబ్బారావు, కోటేశ్వరరావు, తాండ్ర ప్రకాష్, కోదండరావు పాల్గొన్నారు.

గణితంపై ఆసక్తి కలిగేలా బోధన



మాట్లాడుతున్న వెంకటరమణ

వజ్రపుకొత్తూరు: గణితంపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలని ఎంఈవో–2 బి.వెంకటరమణ అన్నారు. గోవిందపురం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె.హరిబాబు అధ్యక్షతన పలాస, వజ్రపుకొత్తూరు మండలాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల గణిత ఉపాధ్యాయుల సముదాయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే గణిత సవాళ్లను స్వీకరించే విధంగా ఎంసెట్, ఐఐటీ పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. 54 మంది గణిత ఉపాధ్యాయులు హాజరయ్యారు. మండల గణిత సెక్రటరీ చింత ఉమారావు, ఉపాధ్యాయులు దిలీప్ సాహు, జి.గోపాలక్రిష్ణ, బి.కిశోర్, వెంకటరావు, నవీన్, సురేష్, సోమేశ్వరరావు, మాధవ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



శరణ్యకు సాయాన్ని అందజేస్తున్న సభ్యులు

కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన విద్యార్థిని బడే శరణ్య చదువుకు హెల్పింగ్ వారియర్స్ సభ్యులు అండగా నిలిచారు. ఏడు వేల రూపాయలు సేకరించి ఆమెకు బుధవారం అందజేశారు. శరణ్య తండ్రి ఇటీవల మరణించారు. కష్టంలో కూడా పాలిసెట్ రాసి మెరుగైన ర్యాంకు సాధించింది. ఈ నేపథ్యంలో దిగులు చెందకుండా చదువు కొనసాగించాలని కాంక్షిస్తూ ఆర్థిక సహకారం చేశారు. కార్యక్రమంలో ఆర్మీజవాన్ సార కుమార్, హరి, మని, దిలీప్, వేణు, ఆర్‌జే మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సోంపేట: సమాజంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకనందా శిశుమందిర్‌లో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గుడ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీర నాగభూషణం, ఉపాధ్యాయులు వల్లభరావు పాల్గొన్నారు.

ఒకటి నుంచి పౌష్టికాహార వారోత్సవాలు

గార: సెప్టెంబర్ ఒకటి నుంచి జరగనున్న పౌష్టికాహార వారోత్సవాలను పక్కాగా నిర్వహించాలని ఐసీడీఎస్ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆర్జేడీ బుధవారం జొన్నలపాడులో జరుగుతున్న సెక్టార్ సమావేశంలో పాల్గొన్నారు. వారోత్సవాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లేదనన్నారు. రికార్డులు తనిఖీ చేసి పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్ సరుకులు కచ్చితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పోలాకి: మండలంలోని తలసముద్రంలో ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల పోస్టర్‌ను బుధవారం పోలాకి ఎస్ఐ వి.సత్యనారాయణ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 6వ తేదీ నుంచి 15 వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఆహ్వాన కమిటీ ఏర్పాటు, ఊరేగింపు అనుమతులు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక స్థానిక కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి సహకరించాలని వినతి

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాయలం ఆవరణలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి సహకరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చల్ల చిరంజీవి కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ స్థలం కోసం ఇటీవల జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేశామన్నారు. వారి ఆదేశాల మేరకు కోటబొమ్మాళి తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ భవన నిర్మాణానికి మండల పరిషత్ కార్యాలయానికి చెందిన స్థలంలో సర్వే చేయించి అనుమతి పత్రం ఇచ్చారన్నారు. దీంతో ఇటీవల పనులు చేపడుతుండగా మండల పరిషత్ సభ్యుల తీర్మాణం లేనిదే భవన నిర్మాణం చేపట్ట వద్దని ఎంపీపీ రోణంకి ఉమ, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ ఆదేశాలు జారీ చేయడంతో పనులు నిలిచి పోయినట్టు పేర్కొన్నారు. భవన నిర్మాణానికి అధికారులు, నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన సుడా కార్యదర్శి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను కలెక్టర్ కార్యాలయంలో సుడా కార్యదర్శి ఎం.వి.లక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె శుక్రవారం సుడా కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం నుంచి బదిలీపై వచ్చి ఇక్కడ విధులు నిర్వహిస్తారు.

సీఎం జగన్‌తోనే మహిళలకు రక్షణ



ఇచ్ఛాపురం: 'జగనన్న రక్ష' అక్షర క్రమంలో విద్యార్థినులు

- రక్షా బంధన్ వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



కంచిలి: ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం: రాష్ట్రంలోని మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పూర్తి రక్షణ సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో రాఖీ పౌర్ణమి సందర్భంగా విద్యార్థినులతో ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం దిశ వంటి ప్రత్యేక యాప్‌ని ప్రభుత్వం రూపొందించి అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా 'జగనన్న రక్ష' అక్షరమాల రూపంలో విద్యార్థినులు కూర్చుని రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లు పిలక రాజలక్ష్మి, ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చాట్ల సుజాత, వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, హెచ్ఎం పద్మవల్లి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ సాలిన ఢిల్లీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.

అధికారులకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

కంచిలి: మండలంలోని పలువురు అధికారులకు కంచిలికి చెందిన బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యక్తుల్లోని అహం, క్రోదం వంటి చెడ్డగుణాలను విడనాడాలని పిలుపునిచ్చారు. పలాస ఆర్డీవో తమరాల సీతారామ్మూర్తి, స్థానిక ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డిలకు బ్రహ్మకుమారి క్రిష్ణవేణి రాఖీలు కట్టారు. ఆమెతోపాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ భరోసా

- టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి
- విశ్వనాథపురం సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సీతారాంపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాల అమలుతో ప్రతి కుటుంబానికి సంక్షేమ భరోసా చేకూరిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. విశ్వనాథపురం సచివాలయం పరిధిలోని సీతారాంపురం, సింద్రిపేట, సింహాద్రిపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధిదారుల జీవితాల్లో ఎలాంటిమార్పులు తీసుకువచ్చాయో అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి.. ప్రస్తుత పాలనకు వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలను కోరారు. అర్హులైన ఏఒక్కరికీ పథకం రాలేదన్న ఫిర్యాదు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. వాణి కుమార్తె డాక్టర్ హైందవి తల్లికి తోడుగా వచ్చి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, సర్పంచ్‌లు పంకు సింహాచలం, నూక సత్యరాజ్, గురువెల్లి గోవిందరావు, నేతింటి సింహాచలం, కొండాల సిమ్మయ్య, పేడాడ దామోదర్‌రావు, సనపల జనార్దన, ఆర్.శివారెడ్డి, అక్కురాడ సురేష్, ఎంపీటీసీ సభ్యులు పూజారి సత్యం, పంకు రాము, జేసీఎస్ ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, కన్వీనర్లు బమ్మిడి శ్రీనివాస్, హనుమంతు దాలయ్య, పంచాయతీ కార్యదర్శులు ఎస్ఎస్ చైతన్య, పూతి సృజన, వీఆర్వో కూన దాలప్ప పాల్గొన్నారు.

అందుబాటులో అధునాతన నేత్ర వైద్యం



ర్యాలీలో ఆస్పత్రి చైర్మన్ భవానీశంకర్, సూపరింటెండెంట్ మేఘన

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో అధునాతన కంటి వైద్యం అందుబాటులో ఉందని ఆస్పసత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్ అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. బుధవారం ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడారు. ఇక్కడ మెరుగైన నేత్ర వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలను కూడా చేస్తున్నట్టు పేర్కొన్నారు. సేవలను ఈ ప్రాంతీయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.మేఘన, డాక్టర్ కూర్మారావు, ఆప్తమిక్ అసిస్టెంట్ తారకేశ్వరరావు, హెడ్‌నర్సు ఉమాదేవి, గౌరీ, శ్రీధర్, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు భూ సేకరణలో భాగంగా రైతులు ఆధీనంలో ఉన్న జీడి చెట్లకు నష్ట పరిహారంగా బుధవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు. మూలపేటలో నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల నుంచి 120 మంది రైతులకు ఒక్కో జీడి మొక్కకు రూ. 2.500 చొప్పున్న లెక్కకట్టి పరిహారాన్ని అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి మొక్కకు నష్టపరిహారం చెల్లించిందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అన్నారు. కొన్ని సాంకేతిక సమస్యలు, కుటుంబ సభ్యులు అభ్యంతరాలపై మరో పదిమంది వరకు చెక్కులు పంపిణీ అలస్యం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వసముద్ర జీఎం శంకర్, రెవెన్యూ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.